రాజేశ్వరి

అదే మరెవరైనా అయితే యీ సాంఘిక నేరానికి చట్టం నిర్ణయించిన పూర్తి శిక్షను తన అధికార హోదాతో విధించే ఉండేవాడు కాని...

...కాని ఆమె కేవలం తన భార్య అయిపోయింది.

నలుగురులోనూ మెసలడం ఎలాగో చాతకాక ప్రతివాళ్ళతోనూ తగువులు తెస్తూంటే ఎన్నాళ్ళని భరించడం.

తన మంచితనం, ఉద్యోగహోదా ఎవరికి కావాలి, అందులోనూ యిరుగూ, పొరుగూ ఆడవాళ్ళకి.

ఎంతకని యిల్లు మారుస్తూండడం.'

కనీసం నెల రోజులైనా ఒక యింట్లో సవ్యంగా ఉండలేకపోతే ఎలా చావడం.

ఇది వెంకట్రావు నిత్యజీవిత సమస్య.

నానాటికి శృతిమించుతున్న ఈ దుర్భగ సమస్యని, యికనైనా అంతుమాడకపోతే తన భార్య మాట అటుంచి తన కూడా సంఘంలో మెసిలే యోగ్యత క్షీణిస్తుందేమోనని భయపడ్డాడు వెంకట్రావు.

చూసి చూసి ఒక సుముహూర్తాన తన పైఅధికారిదగ్గరకు వెళ్ళాడు.

ఎలాగైనా తనని మహాటవీ మధ్యంలో ఒక మన్యం తాలూకాకి బదిలీ చెయ్యమని కోరాడు.

పై అధికారి ఆశ్చర్యపడ్డాడు.

ఆ తాలూకాకి ఎవరిని బదిలీచేసినా 'వెళ్ళను బాబో' అని తప్పించుకుందికి విశ్వప్రయత్నం చేసేవాళ్ళే కాని సంతోషంగా వెళ్ళినవాడు యింతవరకూ ఒక్కడైనా లేడు. అటువంటిది వెంకట్రావు బుద్ధిపూర్వకంగా అక్కడికి బదిలీ కావాలీ అని అంటే, పై అధికారికే ఏమిటి, ఆ తాలూకా సంగతి తెలిసిన అందరికీ ఆశ్చర్యం వేస్తుంది.

పై అధికారి చాలా సంతోషించాడు వ్యవహార దక్షుడైన వెంకట్రావు అక్కడకు వెళతానన్నందుకు.

వెంటనే టైపుమిషను టపటప లాడింది

ఆర్డరు పట్టుకుని టకటక బూటుతో యింటికి వచ్చాడు వెంకట్రావు.

భార్యను పిలచాడు.

'యీ వేళ యింత త్వరగా వచ్చేశారేం' అంది భార్య రాజేశ్వరి.

'యీరోజుతో యిక్కడ ఉద్యోగం అయిపోయింది. మనకి బదిలీ అయింది.'

"ఎక్కడికి"

'మన్యం తాలూకాకి'

'అమ్మ బాబోయ్!'

'ఎప్పుడూ ఒక్కదగ్గిరే కూర్చుందామనుకున్నావేం పాపం'

"ఒచ్చి ఆర్నెల్లైనా అవలేదుకదా అప్పుడే బదిలీ ఏమిటండీ"

"మరి నీ తడాఖా అంటే ఏమిటనుకున్నావ్"

"మధ్యని నేనేంచేశాను"

"ఏ యింట్లో ఉంటే ఆ యింటి యిరుగు పొరుగులవాళ్లతో మనం తగువులాడుతున్నామట. అందుకని వాళ్లందరూ మనమీద కాయితాలు వ్రాసి పై అధికార్లకు పంపారు. మనం నలుగురితోనూ తిరిగే యోగ్యతలేని వాళ్లమని యిలా చేశారు" అని అతి నేర్పుగా అబద్ధమాడాడు వెంకట్రావు.'

"మనమేం తగువులు తెస్తున్నామండీ" అంది కోపంగా రాజేశ్వరి.

'ప్రభా'

అప్పుడే ఆమె ముఖం జేగురురంగుగా మారటానికి ప్రారంభిస్తోంది.

"అదే నేనూ ఆలోచించి ఆశ్చర్యపోతున్నది. అయినా యిదీ మన మంచికేగా. అక్కడ చక్కని యిల్లు ఉంది. ఎక్కచ్చీగా మనమే వాడుకోవచ్చు. యిరుగూ, పొరుగూ ఎవరూ లేరు. నువ్వు తగువు వేద్దామన్నా అలాంటి అవకాశం లేదు.'

"నలుగురు లాగే మీరూ అనండి. నేనేం తగువులు తెస్తున్నాను చెప్పండి. యింట్లో మీరు యిలా అంటూంటేనే ఊళ్ళోవాళ్ళు మరీ అంటున్నారు"

"వాళ్లని నువ్వూ ఊరుకోవడం లేదుగా"

"అయితే మీ ఉద్దేశం అందరిచాతా మాటలు పడమనేనా?"

అప్పుడే భార్యలోని మార్పుని గమనించాడు వెంకట్రావు. యింక యింతకన్న ముదరబెడితే లాభం లేదనుకున్నాడు.

"పోనీలే యిప్పుడు అయిపోయిన దానికెందుకు" అన్నాడు.

"అయితే మన యింటి సంగతులన్నీ ఆఫీసువాళ్ళకెందుకండీ [illegible] తెలియక అడుగుతాను'

"నిజమే కాని మనం సంఘజీవులం కాబట్టి సంఘంతో ఐకమత్యంగా ఉండాలి. అదే మనకి చాతకాలేదని వారి అభిప్రాయం"

2

మహారణ్యంమధ్య మెలికలు తిరిగిన ఘాట్ రోడ్డుమీదనుంచి బస్సు నిదానంగా నడుస్తోంది. ఒకప్రక్క కొండ. మరోప్రక్క పాతాళానికి దారితీసే అగాధం ఆ అగాధం వైపు చూస్తూంటే కళ్ళు తిరిగి గుండె జారిపోయినట్టుండేది రాజేశ్వరికి. ప్రమాద నివారణకై అగాధంవైపు కట్టిన పిటగోడకి మెలికలు తిరుగుతున్నప్పుడు ఎన్నోసార్లు ఢీకొనేదిబస్సు. దురదృష్టవశాత్తూ పిటగోడ పడిపోతే బస్సూ, బస్సులో ఉన్న మనుష్యమాత్రులూ ఏమైపోతారు అనుకుంది ఆమె. ఒక్క సారి డ్రైవర్ని చూసింది. సకలభువనరక్షకుడైన చక్రపాణివోలె డ్రైవరు స్టీరింగు చక్రాన్ని పట్టుకున్నాడు. ఆ క్షణంలో సాక్షాత్ భగవంతుడైన ఆ స్టీరింగు చక్రపాణిని ప్రాణభిక్ష పెట్టమని మనస్సులో ప్రార్థించింది.

ఘాటీ ఎక్కలేక మూలుగుతూ, మూలుగుతూ మందగమనం సాగిస్తోంది బస్సు. ఆ గహన కుహర యానంలో రకరకాల వృక్షాలూ, వాటి పుష్పాలూ, వాటి పరిమళాలూ, ఆ వింతప్రకృతీ, ఆ వనసౌందర్యం నిజంగా చూసి అనుభవించవలసినదే కాని...

...కాని దురదృష్టవశాత్తూ పిటగోడ పడిపోతే బస్సూ, బస్సులో ఉన్న మనుష్యమాత్రులూ ఏమైపోతారో అన్న ప్రమాదకరమైన ఆలోచనలోపడ్డ రాజేశ్వరికి ఆ రకరకాల వృక్షాలూ, వాటి పుష్పాలూ, వాటి పరిమళాలూ, ఆ వింత ప్రకృతీ, ఆ వన సౌందర్యం ఏమీ కనిపించనే లేదు.

ఎలాగైతేనేం బస్సు మెల్లిగా ఘాట్ రోడ్డును దాటేసింది. అలవాటు ప్రకారం డ్రైవరు బస్సును ఆపుచేసి ఘాట్ రోడ్డులో ఏ ప్రమాదం రాకుండా బస్సునీ, బస్సులో ఉన్న ప్రయాణీకుల్నీ కాపాడినందుకు అక్కడ వనదేవతయైన చెట్టుక్రింద బండకి ఒక టెంకాయకొట్టి మళ్ళీ బస్సు ఎక్కాడు.

బస్సు గమ్యస్థానం చేరుకుంది ఏజన్సీ తాలూకాకి ముఖ్యపట్టణమైన ఆ గ్రామంలో పాతిక ముప్ఫై యిళ్లుకన్న ఎక్కువ

ఉండవు. ఊరిజనాభా ఒకవందకు మించదు. నాలుగైదుశాఖల ఉద్యోగస్తులూ, వారి గుమాస్తాలూ, బంట్రోతులూ, ఒక ముఠాదారూ మొత్తంమీద అందరూ ఉద్యోగస్తులే. వాళ్ళ యిళ్ళూ, ఆఫీసులూ కాక పైగా ఉన్నవి ఉద్యోగులసౌకర్యార్థం వెలసిన ఒక దేశవాళీ కాఫీ హోటలూ, చిన్నకిరాణా దుకాణం. ఉన్న ఆ పాతిక ముప్పై యిళ్ళుకూడా అక్కడా అక్కడా ఉన్నాయి కాని ఒక్కదగ్గర లేవు. ఊరికి నాలుగువైపులూ ఎటు చూసినా మహారణ్యం. మూడు దశాబ్దాల క్రిందట ఆ ప్రాంతంలో లేచిన పితూరీలో శాంతి భద్రతలు నెలకొల్పడానికి తెల్లదొరలు యీ వూరిని సృష్టించి ఆఫీసులు పెట్టారు. ఇక్కడ ఆఫీసుల్లో చెప్పుకోతగ్గంత పనీపాటూ ఏమీ లేకపోయినా అక్కడ ఉన్నందుకే ఉద్యోగస్తులకి జీతం యివ్వవచ్చు. ఉదయం తొమ్మిది గంటలకు గాని పొగమంచు తెరలు విడవు. అప్పుడు సూర్యదర్శనం అవుతుంది. తిరిగి మూడు గంటలకు సూర్యుడు మాయమైపోతాడు. శీతాకాలంలో మరీకష్టం. ఆ చలికి కొరడు కట్టిపోవల్సిందే. యిరవైనాలుగ్గంటలూ నెగళ్ళు పెట్టుకోవల్సిందే. అక్కడి నీరు త్రాగితే ఆజన్మాంతం మలేరియా వదలదని ప్రతీతి. కాని మలేరియా నివారణశాఖ వారు చేస్తూన్న కృషివల్ల దాని ఉధృతం తగ్గింది. ఏమైనా ఆ వూరు ఒక పీడకల వంటిది. నేరస్థులకు అండమాన్సు ఎటువంటిదో ఉద్యోగస్థులకు ఆ వూరు అటువంటిది

3

విశాలమైన మూడు గదులూ, ఒక వంటిల్లూ, యింటి ముందు ఆవరణలో రకరకాల పువ్వుల చెట్లూ, పెద్ద పెరడూ— యిల్లు చూడగానే పిల్లా, పచికా లేని దంపతులకి ఆ యిల్లు పెద్దదే అనిపిస్తుంది

యింటిగురించి ఏవిధమైన వ్యాఖ్యానాన్నీ చెయ్యలేదు కాబట్టి రాజేశ్వరికి యిల్లు నచ్చినట్టే.

ఆ క్రొత్త ప్రదేశంలో, నూతన వాతావరణంలో వారంరోజులు గడిచాయి. ఆ ప్రదేశానికిగానీ, ఆ వాతావరణానికిగానీ యింకా రాజేశ్వరీ, వెంకట్రావూ అలవాటు పడనేలేదు.

రోజులు గడవడం అక్కడ చాలా కష్టంగానే ఉంది వెంకట్రావు ఎలాగో ఒకలాగ ఆఫీసుపనితో కాలం వెళ్ళబుచ్చుతున్నాడు గాని, రాజేశ్వరికి పగలు తరగకుండానే ఉంది. నవలలూ, పత్రికలూ ఎంతసేపని చదువుతుంటుంది. బాతాకానీ వేసేదామంటే యిరుగూ, పొరుగూ లేదాయె.

"యిక్కడకు పులులుకూడా వస్తాయా శీతయ్యా"

"అదో మాటా తల్లీ! ఒకొక్కప్పుడు ఊరంతా గస్తీ తిరుగుతాయికూడా"

రోజులు గడిచిపోతున్నకొద్దీ ఒకరోజు కొకరోజు అక్కడి జీవితం ఆవిడకు కష్టమే అనిపించింది. కష్టమన్నమాటేమిటి నిజంగా జైల్లో ఉన్నట్టే భాసపడింది.

ఒక రోజున వెంకట్రావు క్యాంపు వెళ్ళిపోయాడు.

చీకటి రాత్రి.

యింటిదగ్గర కాపలాకై పడుకునే ముసలి బంట్రోతు యింకా రాలేదు.

ఎటుప్రక్క చూసినా గాఢాంధకారం. నాలుగు మూలలనుంచీ నక్కల అరుపులూ, కీచురాళ్ళ ధ్వనీ, హోరుమని గాలీ. రాజేశ్వరికి భయం పట్టుకుంది. యిన్నాళ్ళూ భర్త తోడుగా ఉండేవాడు కాబట్టి ధైర్యంగానూ, ధీమాగానూ ఉంది కాని యీనాటి కారు నల్లని కాళరాత్రి ఆమెను భయపెట్టింది. ఎదురుగా ఆ చీకట్లో జుత్తు విరియబోసుకున్న దెయ్యంలా ఉన్న జీలుగ చెట్టును చూసి ఆమె 'అమ్మో' అంది.

"ఏమమ్మా" అన్నాడు బంట్రోతు.

బంట్రోతు ఎప్పుడు వచ్చినదీ కూడా ఆమెకు గుర్తులేదు.

"ఎప్పుడొచ్చావ్ శీతయ్యా... నాకు భయంవేస్తోంది. చూడు అదేదో దెయ్యంలా ఉంది"

"మరేం భయంలేదమ్మా! నే నిక్కడే ఉన్నానుగా. అది దెయ్యంకాదూ, భూతం

★ రాజేశ్వరి ★

కాదూ రోజూ మనం చూసే జీలుగుకట్టే తల్లీ!"

"ఏమో నాకు చాలా భయంవేస్తోంది"

"ఏం భయంలేదమ్మా. తమరి కింకా కొత్త కాబట్టి అలా అవుతున్నారు. ఇక్కడకువచ్చిన కొత్తలో నేనూ అలాగే భయపడేవాడినండి అమ్మగారు. కాని సంవత్సరాలు గడిచినకొద్దీ అలవాటు పడిపోయి యిప్పుడు ఊళ్లో పులిగానీ, దుమ్మరగుండు గానీ ఏది తిరిగినా భయమే ఉండదుతల్లీ"

"యిక్కడకు పులులుకూడా వస్తాయా శీతయ్యా!"

"అదోమాటాతల్లీ. ఒకొక్కప్పుడు ఊరంతా గస్తీ తిరుగుతాయికూడా"

"అమ్మయ్యో! మరి ఎలాగ శీతయ్యా!"

"అలాగేనమ్మా మరి ఏంచేస్తాం. ఇప్పుడు అయ్యగారు మకాంచేసిన బంగాళాచుట్టూ పగలూ, రాత్రీ కూడా పులులు తిరుగుతునే ఉంటాయి"

"మరేంప్రమాదం రాదుకదశీతయ్యా!"

"ఎంతమాట శెలవిచ్చారు తల్లీ. అలాగైతే ఉద్యోగం చెయ్యగలమా"

"ఏమోశీతయ్యా! నాకు బెంగగాఉంది."

"పిచ్చితల్లీ! పాపం అయ్యగారు ఏం తప్పిదం చేశారో ఇక్కడకు బదిలీ అయారు. ఆ తప్పిదానికి వారేకాకుండా మీరుకూడా యిక్కడ బాధపడుతున్నారు పాపం"

"అదేమిటి శీతయ్యా అలా అంటున్నావ్"

"అన్నే ఏం ———"

"అయ్యగారేదో తప్పచేశారంటున్నావే"

"అవునమ్మా! లేకపోతే యిక్కడకు బదిలీ చెయ్యరు."

తప్పెవరిదో ఆమెకి యిప్పుడు అర్థమైంది.

ఈ దుస్థితికి అంతకీ తనేకదా కారణం అనుకుంది.

తనమూలంగా భర్తకు అప్రతిష్ట వస్తున్నాదని భయపడింది.

యీ విధంగా రాజేశ్వరి బాధపడటం యిదే మొదటిసారి.

4

వెంకట్రావు క్యాంపునుంచి రాగానే ప్రారంభించింది రాజేశ్వరి.

"ఏమండీ యిల్లూ సంసారం అంతా మరిచిపోయారేమిటి? యిన్నేసి రోజులు క్యాంపులో ఉండిపోతే ఎలాగండీ"

"వెళ్ళి మూడు రోజులేగా అయింది"

"నామట్టుకు మూడు సంవత్సరాలులా ఉంది. యిక్కడ ఉండడానికి నాకు ఎంత భయం వేసిందనుకున్నారు"

"ఏం శీతయ్యరాలేదూ"

"వచ్చేవాడు. అయినా యీ అడివిలో చుట్టూ నక్కలూ, జంతువులూ అరుస్తూంటే"

"మరెలాగ అంతా ఉండటం లేదూ"

"యిక్కడనుంచి ఎప్పుడు బదిలీ చేస్తారండి"

"సరిసరి నిన్నకాక మొన్న వచ్చాం. అప్పుడే మన నెవరు బదిలీచేస్తారు. అందులోనూ మనమీద కోపంచాత యిక్కడకు పంపించారన్న విషయం మరిచిపోయావా"

"మనమీద కోపానికి మనం ఏంచేశామని"

"రామాయణమంతా విని రాముడికి సీత ఏమౌతుంది అన్నట్టుంది."

"యిక్కడ ఉండలేం సుమండీ"

"ఏం పోట్లాడిందికి ఎవరూ లేరనా"

"మీ వేళాకోళానికి వేళా, పాళా, సమయం సందర్భం లేనట్టుంది. ఉండలేకనే ఛస్తూంటే వేళాకోళ మాడతారు మీరు."

* * *

యిలా ఆరునెలలు గడిచాయి.

రాజేశ్వరికి భయం ఒకరోజుకు ఒకరోజు ఎక్కువ అయి బెంగపెట్టేసుకుంది. పెద్ద పులుల అరుపులు ఆమె చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. ఏ వస్తువునిచూసినా దుమ్మలగుండులాగనే కనిపిస్తున్నాది.

ఒకనాడు వెంకట్రావు క్యాంపునుంచి తిరిగి వచ్చేసరికి రాజేశ్వరి వెక్కివెక్కి ఏడుస్తూ కూర్చుంది.

భార్య ప్రవర్తన కనిపెడుతూన్న వెంకట్రావుకి ఆరోజున ఆమెలో పూర్తిమార్పు కనుపించింది.

ఆమెపరిస్థితిని చూసి చాలా జాలిపడ్డాడు.

"నేను చచ్చేవరకూ యీవూరినుంచి కదలరా" అంది.

"నాలుగురోజులు ఓర్చాలి మరి"

"అవును యీలోగా ఏ పులో, ఎలుగుబంటో యీడ్చుకుపోతుంది."

"మరి నన్నేం చెయ్యమన్నావ్. ఇదంతా నువ్వు చేసుకున్నదేగా"

"అందుకనే అనుభవిస్తున్నాను. యీ శిక్షకి అంతం ఉందోలేదో"అంది ఏడుస్తూ.

వెంకట్రావులో కరుణరసం వెల్లువలై పరుగెత్తింది. యిక ఆమెని అనునయించక ఉండలేకపోయాడు.

"అయితే యిక్కడనుంచి వెళిపోవాలంటావ్" అన్నాడు.

"అంత అదృష్టంపడితే మరేంకావాలి"

"అయితే అది మన చేతులో నేఉంది."

"నిజంగానేనాండి" అంది ఆత్రతతో.

"ఊ! కాని నువ్వు ఒక పని చెయ్యాలి. ఎప్పుడూ ఎవరితోనూ పోట్లాడనూ అని కాయితం రాసి యిస్తే చాలు."

"కాయితం ఏం ఖర్మం. దస్తావేజు రాశి యిమ్మంటే యిస్తాను" అంది.

మరునాడే వెంకట్రావు శెలవు పెట్టేశాడు.

శెలవు అనంతరం మరోదగ్గరికి బదిలీ అయింది.

* * *

కథ అయిపోయింది.

రాజేశ్వరిలో పోట్లాడే స్వభావం పోయిందో లేదో యిప్పుడు నాకు తెలియదు.

కాని ఒక్క విషయం...

రాజేశ్వరిలో సత్పరిణామం వచ్చిందంటే ఆ ఘనత వెంకట్రావుది. అతణ్ని నిజమైన సంస్కారి అని చెప్పవచ్చు.

ఆమె పూర్వంలాగనే ఉందంటే అది ఆమెతోడనే పుట్టిన స్వభావం. ఆ స్వభావాన్ని ఎంతటి సంస్కర్త అయినా మార్చలేడు.

ఎప్పుడైనా వాళ్లు మీకు తారసిల్లినప్పుడు—

గెలుపు వెంకట్రావుది అయితే అతన్ని అభినందించండి.

లేకపోతే రాజేశ్వరిపై సానుభూతి చూపండి. కాని ఆమెని తిట్టకండి. ★

సకల దంత వ్యాధులకు
కోతిమార్కు
నల్లపండ్లపొడి

ప్రతిచోట దొరకును.
నోగి అండ్ కో
87, బ్రెనాబజార్ రోడ్, మద్రాసు-1
బెజవాడ స్టాకిస్టులు: ట్రేడ్ ప్రమోటింగు కార్పొరేషన్, పోస్టుబాక్సు నెం. 50 గాంధీనగరం.